

రెయిలింగ్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు
తృటిలో తప్పిన ప్రమాదం 7



ప్రైవేటు ఆస్పత్రుల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

టాస్క్‌ఫోర్స్ నజర్

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 : సంగారెడ్డి పట్టణంలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ బృందం గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. పోతిరెడ్డిపల్లిలోని శ్రీచరిత, మంజీరా హాస్పిటల్, బైపాస్ రోడ్డులోని మరో రెండు ఆస్పత్రులను సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. ట్రీట్‌మెంట్ ధరల పట్టిక, డాక్టర్ల పేర్లు, బయోమెడికల్‌వేస్ట్ మెనేజ్‌మెంట్, ఫైర్ సేఫ్టీ తదితర అంశాలను పరిశీలించారు. చికిత్స అందజేస్తున్న డాక్టర్ల విద్యార్హత ధ్రువపత్రాలను తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. రోగులకు అందించిన చికిత్సలు, బిల్స్, కేస్‌షీట్లు తదితర అంశాలను పరిశీలించారు. సేకరించిన వివరాల నివేదికను డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు సమర్పించనున్నారు. స్టేట్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ టాస్క్ ఫోర్స్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్ డా.పుష్పవాణి, స్పెషల్ ఆఫీసర్ డా.రవితేజ ఆధ్వర్యంలో జరిగిన తనిఖీల్లో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీ దేవీ, డెమో ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ రవి, మెంబర్లు సునీల్‌రాజ్, రమావాణి, అనీల్, వెంకట్‌రామ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు

కబ్జాలపై కొరడా



గదులను కూల్చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని బీరంగూడలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను గురువారం సాయంత్రం రెవెన్యూ సిబ్బంది తొలగించారు. సర్వే నంబర్ 993లోని అసైన్డ్‌భూముల్లో ఇటీవల నిర్మించిన గదులను పోలీసు భద్రత నడుమ రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌వేటర్ల సహాయంతో నేలమట్టం చేయించారు. అమీన్‌పూర్ తహసీల్దార్ రాధ మాట్లాడుతూ అసైన్డ్, ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



- సంగారెడ్డి జిల్లాలో భారీగా టీచర్ల ఖాళీలు
- మొత్తం పోస్టులు 6,016 ప్రస్తుతం పనిచేస్తున్నది 5,027 మంది
- జిల్లావ్యాప్తంగా 989 పోస్టులు ఖాళీ
- ఈ ఏడాదికి తాత్కాలిక సర్దుబాటు
- ఊసేలేని అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం
- 551 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్
- ఫలితాల కోసం ఎదురుచూపులు
- ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడేదెప్పుడో?

చదువు చక్కబడేనా..?



సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 : ఉపాధ్యాయ ఖాళీలతో ప్రభుత్వ పాఠశాలలు కుదేలవుతున్నాయి. పోస్టులు మంజూరయి ఉన్నా ఏళ్ల తరబడి ఖాళీగా ఉంచడంతో బోధనపై ప్రభావం పడుతున్నది. సంగారెడ్డి జిల్లాలో 1,247 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 1.15 లక్షల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత వల్ల బోధనకు ఆటంకం కలుగుతున్నది. విద్యాశాఖ చేపడుతున్న వివిధ కార్యక్రమాల అమలులో కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లాకు మొత్తం 6,016 టీచర్ పోస్టులు మంజూరు ఉన్నాయి. ప్రస్తుతం 5,027 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఇంకా 989 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో 551 పోస్టుల భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ వేసి, జూలై 18 నుంచి ఆగస్టు 5 వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు. ఫలితాలు ఇంకా ప్రకటించాల్సి ఉన్నది. డీఎస్సీ పరీక్షలు రాసిన అభ్యర్థులు ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఫలితాలు విడుదల చేసి వచ్చే రెండు నెలల్లో పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. టీచర్ పోస్టులు భర్తీ చేస్తే ఎనిమిదేళ్ల నిరీక్షణకు తెరపడడంతో పాటు విద్యార్థులకు ప్రయోజనం చేకూరనుంది.

పదోన్నతులు, బదిలీలతో తంటాలు

ఇటీవల జరిగిన ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలతో ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పడిన ఖాళీలు విద్యాబోధనకు ఆటంకంగా మారాయి. జిల్లాలో 72 మంది ప్రధానోపాధ్యాయులు, 777 స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పదోన్నతి ద్వారా భర్తీ చేశారు. 2,341 మంది అన్ని క్యాడర్ల టీచర్లు బదిలీ అయ్యారు. ఎస్జీటీలకు.. స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి ఇవ్వడంతో ప్రాథమిక పాఠశాలల్లో భారీగా ఎస్జీటీ ఖాళీలు ఏర్పడ్డాయి. దీంతో, బదిలీ అయినా 389 మంది ఎస్జీటీలు కొత్త స్థానాల్లో చేరలేకపోయారు. మరోవైపు, ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయినా.. ఆ స్థానంలో కొత్తవారు రాకపోవడంతో ఆయా పాఠశాలల్లో ఖాళీలు ఏర్పడ్డాయి.

సర్దుబాటుతోనే సరి

జిల్లావ్యాప్తంగా చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడటంతో 150 మంది టీచర్లను డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేశారు. విద్యార్థుల సంఖ్య కంటే ఉపాధ్యాయులు ఎక్కువగా ఉన్నచోటు నుంచి ఖాళీలు ఉన్నచోటికి సర్దుబాటు చేశారు. జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూల్స్ 58 ఉండగా.. వీటిలో పనిచేసే ఉపాధ్యాయులను కూడా సమీపంలోని పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించారు.

తేలని అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్ల నియామకం

ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు విద్యాశాఖ తాత్కాలికంగా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని విద్యాశాఖ తొలుత నిర్ణయించింది. జిల్లాకు ఎంతమంది అవసరమవుతారో నివేదిక కూడా కోరింది. సంగారెడ్డి జిల్లాలో 232 మంది అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు అవసరమని జిల్లా విద్యాశాఖ అధికారులు నివేదిక పంపించారు. కానీ, ఇప్పటివరకు రాష్ట్ర విద్యాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. డీఎస్సీ నియామకాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో విద్యార్థుల చదువులు కుంటుపడకుండా అకాడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమిస్తే ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయ సంఘాలు పేర్కొంటున్నాయి.

జిల్లాలో ఉపాధ్యాయుల వివరాలు

పోస్టు	మంజూరు	పని చేస్తున్నవారు	ఖాళీలు
హెచ్‌ఎం- గ్రేడ్-2	197	187	10
స్కూల్ అసిస్టెంట్	2,642	2,414	228
ఎస్జీటీ	3,043	2,384	659
ల్యాంగ్వేజ్ పండిట్	48	17	31
పీఈటీ	17	11	6
క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్	69	14	55
మొత్తం	6,016	5,027	989

డిసెంబర్‌లోగా అందుబాటులోకి బయోమైనింగ్ ప్లాంటు

తడి, పొడి చెత్త వేరు చేయండి
సంగారెడ్డి మున్సిపల్ అధికారులకు కలెక్టర్ క్రాంతి ఆదేశం
ఫసల్‌వాది డంప్‌యార్డును పరిశీలించిన జిల్లా పాలనాధికారి



ఫసల్‌వాదిలోని డంప్‌యార్డుని పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 12 : సంగారెడ్డి మండలం ఫసల్‌వాది గ్రామంలోని డంప్‌యార్డుని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం పరిశీలించారు. ఈ నెల 11న 'ఆంధ్రజ్యోతి'లో 'కాలుష్యం డంపు.. పొలాలు ముంపు' అనే శీర్షికన వచ్చిన కథనానికి ఆమె స్పందించి స్వయంగా తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేయాలని మున్సిపల్ చేయాలని అధికారులను ఆదేశించారు. చెత్తను బయట వేయకుండా డంప్‌యార్డులోనే వేయాలని సూచించారు. పురపాలకశాఖతో సృష్టి ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చేసుకున్న ఒప్పందం మేరకు వర్షాలు తగ్గుముఖం పట్టిన అనంతరం బయోమైనింగ్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. రోజుకు 1,500 మెట్రిక్ టన్నుల చెత్తను బయోమైనింగ్ చేసేలా ఏర్పాటు చేస్తున్న ప్లాంట్ డిసెంబర్ వరకు అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, తహసీల్దార్ దేవదాస్, మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ తదితరులు ఉన్నారు.

సంగారెడ్డి మండలంలో పర్యటన

సంగారెడ్డి మండలంలోని పలు గ్రామాలను కలెక్టర్ క్రాంతి గురువారం సదర్శించారు. ఇస్మాయిల్‌ఖాన్‌పేట గ్రామంలోని అర్బన్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, డెంగీ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహార పంపిణీని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. తహసీల్దార్ దేవదాసు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

దండం పెడతాం.. డంపుయార్డు వద్దు
కలెక్టర్‌తో గుండ్లమాచునూర్ గ్రామస్థుల మొర 7

ఏడుపాయలలో మళ్లీ మంజీరా ఉధృతి



మంజీరా నది పోటెత్తడంతో ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయాన్ని గురువారం మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు నిర్వహించారు. నది వైపు ఎవరూ వెళ్లకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

-పాపన్నపేట

'ఫత్తేపూర్'ను సందర్శించిన అధికారులు

కల్హేర్, సెప్టెంబరు 12: జ్వరాలతో మంచంపట్టిన ఫత్తేపూర్ గ్రామాన్ని కల్హేర్ ఎపీడీవో రమేష్‌బాబు, ఎంపీఈవో శ్రీనివాసులు గురువారం సందర్శించారు. గ్రామంలో విషజ్వరాల విజృంభనపై 'మంచంపట్టిన ఫత్తేపూర్' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. గ్రామాన్ని సందర్శించి నివేదిక పంపాలని ఆదేశించడంతో మండల అధికారులు గ్రామంలో పర్యటించారు. గ్రామంలో కొనసాగుతున్న వైద్యశిబిరాన్ని పరిశీలించారు. ఎంతమంది వైరల్‌ఫీవర్ బారినపడ్డారు.. ఎంతమందికి చికిత్సలు అందజేశారని సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది రాంచందర్, స్వరూపను అడిగి తెలుసుకున్నారు. నిత్యం పరీక్షలు నిర్వహించాలని, మందులు పంపిణీ చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. దోమలు వ్యాపించకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఫత్తేపూర్‌లో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నిమ్మజ్జనాల సందడి షురూ..





గణేశ్ నిమజ్జనాల సందడి మొదలైంది. సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువులో గురువారం బాల వినాయకులను నిమజ్జనం చేశారు. పట్టణంలోని వివిధ మండపాల్లో ఐదు రోజులు పూజలందుకున్న వినాయకులను ఊరేగింపుగా మహబూబ్‌సాగర్ చెరువుకు తరలించి నిమజ్జనం చేశారు.

-సంగారెడ్డి రూరల్

ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్



మెదక్ అర్బన్, సెప్టెంబరు 12: గ్రామాల్లో ఈ నెల 17న నిర్వహించనున్న ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ గురువారం ఓ ప్రకటనలో అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు, కార్యాలయాల్లో ఉదయం 9:30 గంటల వరకు జాతీయ జెండాను ఎగరవేయాలని సూచించారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ప్రభుత్వ సలహాదారు కేకేశవరావు చేతుల మీదుగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. అనంతరం సందేశం, పోలీసుల గౌరవ వందన స్వీకరణ, సాంస్కృతిక తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. వేడుకలకు తగిన ఏర్పాట్లు చేయాలని వివిధ శాఖల అధికారులకు ఆయన సూచించారు.

బ్రిడ్జికి కర్ర సాయం..!

గాలిలో దీపంలా భద్రత



బ్రిడ్జి కింద ఇనుప కమ్మీ వంగిపోవడంతో సపోర్టుగా ఉంచి కర్ర

సదాశివపేట, సెప్టెంబరు 12 : అది 65వ నంబర్ జాతీయ రహదారి. పక్కనే కొత్తగా ఓ హోటల్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారిపై వచ్చిపోయే వాహనాలు వస్తేనే దానికి గిరాకీ. కానీ, హోటల్‌కు వచ్చేందుకు సరైన దారి లేదు. దీంతో ఆ హోటల్ యాజమాన్యం జాతీయ రహదారి నుంచి సర్వీస్ రోడ్డు.. దానికి అనుసంధానంగా ఓ బ్రిడ్జిని నిర్మించింది. ఇందుకు అన్ని అనుమతులూ తీసుకున్నప్పటికీ సదరు బ్రిడ్జి నిర్మాణం విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదు. ఇంజనీర్ల సూచనలు, అంచనాలు, నాణ్యతా ప్రమాణాలు పాటించక పోవడంతో బ్రిడ్జి నిర్మాణం పనులు అడుగడుగునా నాసిరకంగా దర్శనమిస్తున్నాయి. బ్రిడ్జి నిర్మించి కొద్ది నెలలే అవుతున్నా.. ఏ సమయంలోనైనా..కుప్ప కూలిపోయే పరిస్థితి కనపడుతున్నది. కొత్తగా నిర్మించిన బ్రిడ్జి కింది భాగంలో బ్రిడ్జికి సపోర్టుగా ఉపయోగించిన ఐరన్ బీమ్‌లు, ఐరన్ రాడ్‌లు బ్రిడ్జిపై నుంచి వెళ్లే వాహనాల బరువుకు వంగిపోయాయి. గమనించిన హోటల్ యాజమాన్యం బ్రిడ్జి కింది భాగంలో వంగిపోయిన ఐరన్ బీమ్‌లకు, ఐరన్ రాడ్‌లకు కర్రలను సపోర్టుగా పెట్టింది. బ్రిడ్జిపై నుంచి వెళ్లే వాహనాల బరువును ఆ కర్ర ఆపుతుందా అన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.





నాగ్సాన్‌పల్లి పరిధిలో 65వ జాతీయ రహదారి పక్కన సర్వీస్ రోడ్డుపై ఓ హోటల్ యాజమాన్యం నిర్మించిన బ్రిడ్జి

పింఛన్ కోసం వెళితే.. చనిపోయావ్ అంటున్రు



పింఛన్ దరఖాస్తుతో తుల్జయ్య

- 'ఆసరా' కోసం వృద్ధుడి తిప్పలు
- మూడేళ్లుగా కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు

కోహీర్, సెప్టెంబరు 12 : పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ ప్రజావాణికి వెళ్లిన ఓ వృద్ధుడికి వింత అనుభవం ఎదురైంది. వివరాల్లోకి వెళ్లితే సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం పైడిగుమ్మల్ గ్రామానికి చెందిన 71 ఏళ్ల ఎర్రగొల్ల తుల్జయ్య వృద్ధాప్య పింఛన్ కోసం 2020 డిసెంబర్‌లో దరఖాస్తు చేసుకోగా ఇప్పటికీ మంజూరు కాలేదు. మూడేళ్లుగా ఎంపీడీవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకకపోవడంతో ఇటీవల కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశాడు. అక్కడ అధికారులు ఆయన ఆధార్‌కార్డుతో పింఛన్ స్టేటస్‌ను పరిశీలించగా మీ-సేవ డేటా ప్రకారం తుల్జయ్య చనిపోయినట్లు కనిపించడంతో కంగుతిన్నాడు. దీనిపై తుల్జయ్య ప్రశ్నించగా.. పంచాయతీ కార్యదర్శిని కలిసి అడుగు అని వెనక్కి పంపించారు. అనంతరం తుల్జయ్య పంచాయతీ కార్యదర్శిని కలిసి విషయాన్ని వివరించగా.. అతను పింఛన్ దరఖాస్తు స్వీకరించాడు. ఈ విషయమై కోహీర్ ఎంపీడీవో భారతిని సంప్రదించగా టెక్నికల్ సమస్య వలన చనిపోయినట్లు నమోదైందని, లబ్ధిదారుడికి పింఛన్ మంజూరు చేయాలని త్వరలోనే ఉన్నత అధికారులకు నివేదిస్తామని తెలిపారు.

నిమజ్జనం.. కారాదు విషాదం
వినాయకుడి శోభాయాత్రలో జాగ్రత్తలు తప్పనిసరి 7

రాజీమార్గమే మేలు
ఈ నెల 28 జాతీయ లోక్‌అదాలత్
మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

తెగుళ్ల తంటా.. కన్నీళ్లు కంట
వర్షానికి దెబ్బ తిన్న పంటలు
ఆందోళనలో అన్నదాతలు 7



విద్యుదాఘాతంతో యువకుడి మృతి

పొలం వద్ద మంచె వేస్తుండగా ఘటన


దాచారం దీపక్ (ఫైల్)

వర్గల్, సెప్టెంబరు 12 : విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం వర్గల్ మండల పరిధిలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం వేలూర్ గ్రామానికి చెందిన దాచారం కృష్ణ, ఇందిర దంపతులకు ఇద్దరు కుమారులు. రెండో కుమారుడైన దాచారం దీపక్(20) ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. మొక్కజొన్న పంట చేతికి రావడంతో దానిని కాపాడుకునేందుకు మంచె ఏర్పాటు చేయాలని తల్లిదండ్రులతో కలిసి గురువారం సాయంత్రం పొలం వద్దకు వెళ్లాడు. మంచె ఏర్పాటు చేయడం కోసం కర్రలు తీసుకుని వస్తుండగా కర్రలు ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగలడంతో షాక్‌కు గురయ్యాడు. దీపక్‌ను చికిత్స కోసం కుటుంబ సభ్యులు ములుగు మండలం లక్ష్మక్కపల్లి ఆర్వీఎం ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విద్యుత్ తీగలు కిందకు ఉండటంతోనే ప్రమాదం చోటుచేసుకుందని కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దీపక్ మృతి పట్ల వేలూర్ గ్రామంలో విషాదం చోటు చేసుకున్నది.

బొల్లారంలో ఎండు గంజాయి పట్టివేత

జిన్నారం, సెప్టెంబరు 12: జిన్నారం మండలం బొల్లారంలో పోలీసులు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నమ్మదగిన సమాచారంతో గురువారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో బొల్లారం మల్లన్న బస్తీలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు యువకులను చెక్ చేయగా, వారి వద్ద 750 గ్రాముల ఎండు గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పిల్లలతో మొబైల్ ఫోన్ల చోరీ

● కారు, 17 సెల్‌ఫోన్లు, రూ.5వేల నగదు స్వాధీనం

తూప్రాన్, సెప్టెంబరు 12 : పిల్లలతో మొబైల్ ఫోన్ల చోరీలు చేయిస్తారు. చోరీలు చేసిన ముఠా నాయకుడికి అందజేస్తారు. చోరీ మొబైల్ ఫోన్లు అమ్ముకుని డబ్బు తీసుకుంటారు. గురువారం తూప్రాన్‌లో పోలీసుల తనిఖీల్లో సెల్‌ఫోన్ల చోరీలకు పాల్పడుతున్న నలుగురు సభ్యులు పట్టుబడ్డారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణ ఆర్టీసీ బస్టాండ్ వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా షిఫ్ట్ డిజైర్ కారులో నలుగురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించగా 17 మొబైల్ ఫోన్లు చోరీ చేసినట్లు గుర్తించారు. వారి వద్ద నుంచి మొబైల్ ఫోన్లు, రూ.5వేల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల జిల్లా డోన్ పట్టణానికి చెందిన ఈడిగా రవికుమార్ (27), కర్నూల్ జిల్లా ఎమ్మిగనూర్‌కు చెందిన సత్పాడి అరవింద్ (20)తో పాటు 13ఏళ్లలోపు ఇద్దరు చిన్నారులను పట్టుకున్నారు. ముఠా నిర్వహిస్తున్న ప్రధాన నిందితుడు ప్రభు పరారీలో ఉన్నట్లు ఎస్‌ఐ వివరించారు. పట్టుకున్న నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు

అప్పుల బాధ భరించలేక డ్యాన్స్ మాస్టర్ అదృశ్యం

చనిపోతున్నాను.. కుటుంబాన్ని ఆదుకో అని మిత్రుడికి వాట్సాప్ మెసేజ్


అదృశ్యమైన డాన్సు మాస్టర్ నరేష్ (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12 : అప్పు చేసి ఓ ప్లాట్ కొనుగోలు చేశాడు... అప్పు ఇచ్చిన వారి నుంచి తిరిగి డబ్బు ఇవ్వాలని ఒత్తిడి పెరగడంతో తీవ్ర మనస్తాపం చెందాడు... తాను చనిపోతున్నానని తన స్నేహితుడికి వాట్సాప్ ద్వారా మెసేజ్ పంపించి కనిపించకుండా పోయాడో డ్యాన్స్ మాస్టర్. ఈ ఘటన సంగారెడ్డి పట్టణంలో గురువారం చోటు చేసుకున్నది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎస్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం... సంగారెడ్డి పట్టణానికి చెందిన జిల్లా నరేష్(30) పోతిరెడ్డిపల్లిలో ఎస్ఎస్‌డీపీ డ్యాన్స్ స్కూల్ ఏర్పాటు చేసి పిల్లలకు డ్యాన్స్ నేర్పిస్తుంటాడు. అయితే ఇటీవల పట్టణంలోని బైపాస్ రోడ్డులో ఓ ప్లాట్ కొనుగోలు నిమిత్తం తెలిసిన వారి వద్ద అప్పులు చేశాడు. అప్పు ఇచ్చిన వారి నుంచి తిరిగి ఇవ్వాలని తీవ్ర ఒత్తిడి రావడంతో భరించలేక, మనస్తాపానికి గురై గురువారం ఉదయం 9.30 గంటలకు తన మోటార్ సైకిల్ తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. సాయంత్రం 6.35 గంటల సమయంలో తన స్నేహితుడైన బాణాల శ్రీనివాస్‌కు 'ఐ మిస్ యూ.. నేను చనిపోతున్నాను.. నా కుటుంబాన్ని ఆదుకో' అని కోరుతూ వాట్సాప్ మెసేజ్ పంపించాడు. ఆ తర్వాత తన ఫోన్‌ను స్విచాఫ్ చేశాడు. ఈ విషయాన్ని నరేష్ భార్య జిల్లా వనజకు తెలియజేయడంతో ఆయన గురించి పలుచోట్ల వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో నరేష్ భార్య వనజ పట్టణ పోలీసులకు గురువారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు. అతని గురించి ఆచూకీ తెలిసిన వారు 08455 276333 లేదా 8712656718 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

డాక్టర్ నిర్లక్ష్యంతోనే మరణించాడని కుటుంబసభ్యుల ఆందోళన


బొల్లారం రమేశ్(ఫైల్)

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12 : ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరు మృతిచెందగా, వైద్యుడి నిర్లక్ష్యంతోనే మరణించాడని కుటుంబసభ్యులు ఆందోళన చేసిన సంఘటన సంగారెడ్డిలో చోటుచేసుకున్నది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన బొల్లారం రమేశ్(34) మెడనరాల నొప్పి, ఫిట్స్ సమస్యతో ఈ నెల 8న సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యారు. ఐదు రోజుల పాటు చికిత్స అందించారు. గురువారం ఉదయం 12 గంటలకు హఠాత్తుగా కార్డియాక్ అరెస్ట్ రావడంతో మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యంతోనే రమేశ్ చనిపోయాడంటూ కుటుంబసభ్యులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంతో వాగ్వాదానికి దిగారు. చికిత్స అందించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలంటూ భీష్మించుకుని కూర్చున్నారు. విషయం తెలుసుకున్న డీఎస్పీతో పాటు పలువురు సీఐలు పోలీసు బలగాలతో ఆస్పత్రి వద్దకు చెరుకుని ఇరు వర్గాలతో మాట్లాడారు. సుమారు ఆరు గంటల ఆందోళన అనంతరం పోలీసులు నచ్చజెప్పడంతో కుటుంబసభ్యులు శాంతించి రమేశ్ మృతదేహాన్ని గ్రామానికి తీసుకెళ్లారు. ఇప్పటివరకు చెల్లించిన బిల్లు కూడా తిరిగి ఇచ్చేశారు. మృతిచెందిన రమేశ్‌కు ఇద్దరు చిన్న పిల్లలున్నారని ఆదుకోవాలని కోరడంతో మానవతా దృక్పదంతో చివరికి రూ.2 లక్షలు నగదును ఆస్పత్రి యాజమాన్యం రమేశ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ విషయంలో ఎలాంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

రాజీమార్గమే మేలు

ఈ నెల 28 జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద



మాట్లాడుతున్నమెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి లక్ష్మీశారద

మెదక్ అర్బన్, సెప్టెంబరు 12: కేసుల పరిష్కారానికి రాజీమార్గమే మేలు అనే నినాదాన్ని ప్రజల్లో నింపాలని మెదక్ జిల్లా ప్రధాన న్యాయాధికారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ లక్ష్మీశారద పేర్కొన్నారు. సంగారెడ్డి కోర్టు ప్రాంగణంలో గురువారం ఇన్సూరెన్స్ స్టాండింగ్ కౌన్సిల్, బ్యాంక్, చిట్‌ఫండ్స్ కౌన్సిల్, బార్ అసోసియేషన్ బృందంతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ నెల 28న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు, కక్షిదారులు వినియోగించుకోవాలన్నారు. మెదక్, నర్సాపూర్ కోర్టుల ప్రాంగణంలో జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా న్యాయవాదులు సహకరించాలని కోరారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి జితేందర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వాకింగ్‌కు వెళ్లొచ్చేలోపు చోరీ..


వివరాలు సేకరిస్తున్న ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: ఖేడ్‌ప పట్టణంలో బుధవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానిక ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి కథనం ప్రకారం మెదక్ జిల్లా రేగోడు మండలం కొండాపూర్‌కు చెందిన ప్రభాకర్ ఖేడ్‌లోని మైనార్టీ బాలికల గురుకులం వెనుక కాలనీలోని ఓ అద్దె ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నాడు. బుధవారం రాత్రి 12 గంటల సమయంలో భోజనాలు చేశాక ఇంటి తలుపులు తెరిచి ఉంచి భార్యతో కలిసి కొంతదూరం వాకింగ్‌కు వెళ్లాడు. తిరిగొచ్చేసరికి భార్యకు చెందిన హ్యాండ్ బ్యాగ్ కనిపించలేదు. దీంతో చోరీ జరిగిందని గ్రహించిన ప్రభాకర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంగ్‌లో 6.5 తులాల బంగారం, 5 తులాల వెండి నగలు ఉన్నట్లు బాధితులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఐదేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి..

- ఇరువురి మృతితో అనాథైన బాలిక
- పుట్టెడు దుఃఖంతో తల్లికి తలకొరివి


అంత్యక్రియల్లో తల్లి మృతదేహం ముందు నడుస్తున్న కూతురు

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 : పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని తల్లి చితికి కూతురు తలకొరివి పెట్టిన సంఘటన చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన శ్యామల వారం క్రితం మెదక్‌కు కూలి పనుల కోసం బైకుపై వెళ్తుండగా ఖాజీపల్లి గ్రామ శివారులో మెదక్ చేగుంట రహదారిపై వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొట్టింది. శ్యామలకి తీవ్ర గాయాలు కావడంతో గాంధీ ఆసుపత్రికి తరలించగా... చికిత్సపొందుతూ గురువారం మృతి చెందింది. మృతురాలి భర్త బాలయ్య ఐదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందాడు. ఇరువురి మృతితో కూతురు లక్ష్మి అనాథగా మారింది. పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుతూ తల్లి చితికి తలకొరివి పట్టి ముందుకు సాగింది. కనీసం ఇల్లుకూడా లేని చిన్నారిని దాతలు, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుధ్య పనులపై పకడ్బందీ చర్యలు

- డీఎల్‌పీవో అనిత


కొన్యాల గ్రామంలో పర్యటిస్తున్న డీఎల్‌పీవో అనిత

హత్నూర, సెప్టెంబరు 12: గ్రామాలలో పారిశుధ్య పనులను పకడ్బందీగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి డీఎల్‌పీవో అనిత అన్నారు. గురువారం హత్నూర మండలం కొన్యాల గ్రామాన్ని సందర్శించిన ఆమె గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. నిర్వహించారు. గ్రామాలలో తాగునీటి పైపులైన్ లీకేజీలు ఉంటే మరమ్మతులు చేయాలని సూచించారు. దోమల నివారణకు క్రమంతప్పకుండా మందు పిచికారి చేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఈవో యూసుఫ్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి యువకుడి మృతి

- క్లినిక్ వద్ద ఆందోళన.. నష్టపరిహారానికి ఆర్‌ఎంపీ అంగీకారం

హత్నూర, సెప్టెంబరు 12: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చింతల్ చెర్వు గ్రామంలో ఆర్‌ఎంపీ చేసిన వైద్యం వికటించి ఓ యువకుడు మృతి చెందినట్లు మృతుడి కుటుంబీకులు ఆరోపించారు. వడ్డేపల్లి గ్రామానికి చెందిన కంచి గారి ప్రశాంత్ (35)నర్సాపూర్ లోని బైకు షోరూంలో పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరాడు. గ్రామానికి వస్తుండగా అదుపు తప్పి బైకు పై నుంచి పడిపోయాడు. విషయం తెలుసుకున్న స్థానికులు వెంటనే వెళ్లి దౌల్తాబాద్‌లో ప్రథమ చికిత్స చేయించి, స్వగ్రామానికి తీసుకువచ్చారు. రాత్రి గ్రామంలో నిర్వహించిన వినాయక నిమజ్జనం కార్యక్రమంలో మిత్రులతో కలిసి పాల్గొన్నాడు. గురువారం ఉదయం కడుపులో నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబీకులు చింతల్‌చెర్వులోని ఓ ప్రైవేట్ క్లినిక్‌కు తీసుకెళ్లారు. ప్రశాంత్‌ను పరిశీలించిన ఆర్‌ఎంపీ వైద్యుడు ఇంజక్షన్ చేసినట్లు తోటి మిత్రుల ద్వారా తెలిసింది. కొద్దిసేపటి తర్వాత అతడి పరిస్థితి మరింత విషమించడంతో అక్కడి వారంతా ఆర్‌ఎంపీ వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సంగారెడ్డి సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే ప్రశాంత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అక్కడి నుంచి మృతదేహన్ని చింతల్‌చెర్వులోని ప్రైవేట్ క్లినిక్ వద్దకు తీసుకువచ్చి ఆందోళనకు దిగారు. ఆర్‌ఎంపీ వైద్యుడి నిర్లక్ష్యం వల్లే ప్రశాంత్ మృతి చెందాడని గ్రామస్థులు ఆరోపించారు. దీంతో కొందరు స్థానికులు జోక్యం చేసుకొని మృతుడి కుటుంబానికి రూ.4లక్షలు ఇచ్చేందుకు ఒప్పించారు. దీంతో శాంతించిన స్థానికులు మృతదేహన్ని అక్కడి నుంచి తీసుకెళ్లారు. ఈ విషయమై హత్నూర ఎస్ఐ సుభాష్‌ను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఈ క్లినిక్‌ను గత కొన్ని నెలల క్రితం జిల్లా వైద్యధికారులు సీజ్ చేశారు.

తెగుళ్ల తంటా.. కన్నీళ్లు కంట


తొగుట మండలం ఎల్లారెడ్డిపేటలో దెబ్బతిన్న టమాటా పంట

- వర్షానికి దెబ్బతిన్న టమాటా పంటలు
- తెగుళ్లతో నల్లబారుతున్న కాయలు
- ఆందోళనలో అన్నదాతలు

ఝరాసంగం/తొగుట, సెప్టెంబరు 12: ఇటీవల కురిసిన వర్షాలతో టమాటా పంటలకు తెగుళ్ల సోకి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. టామాటాలు నల్లబారి రంధ్రాలు పడుతుండడంతో మార్కెట్‌కు తరలించలేని పరిస్థితి నెలకొన్నది. దీంతో చాలామంది రైతులు టామాటాలను పొలంలోనే వదిలేస్తున్నారు. ఒక వేళ విక్రయానికి తరలించినా ధర పలకకపోవడంతో కూలీల డబ్బులు కూడా గిట్టుబాటు కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఝరాసంగం మండలంలోని మాచూనూర్, క్రిష్టాపూర్, బర్దీపూర్, కుప్పానగర్ తదితర గ్రామాల్లో టమాటా పంటలను సాగు చేశారు. అలాగే దుబ్బాక సబ్ డివిజన్ పరిధిలోని అక్బర్‌పేట - భూంపల్లి, దౌల్తాబాద్, దుబ్బాక, మిరుదొడ్డి, తొగుట, రాయపోల్ మండలాల్లో 141.36 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేసినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కాగా, తొగుట మండలంలో వంద ఎకరాల్లో కూరగాయల పంటలు సాగైతే.. అధికారులు మాత్రం పంటల నమోదులో కేవలం 6.2 ఎకరాలుగానే నమోదు చేశారు. దీంతో చాలామంది నష్టపోయిన రైతులకు పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది.

ఎకరానికి రూ.15 వేల ఖర్చు..

టామాటా పంట సాగుకు ఎకరానికి రూ.10వేల నుంచి 15 వేల చొప్పున పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. వేసవిలో టమాటా సాగు అధికంగా ఉండడం వల్ల ధర లేక నష్టం వాటిల్లితే.. ప్రస్తుతం మార్కెట్‌లో 20 కిలోల పెట్టెకు రూ.300-500 పలుకుతున్నా.. వర్షాలతో టామాటాలు నల్లబడి ధర పలకడం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

పట్టించుకోని అధికారులు..

వర్షాల నేపథ్యంలో టమాటా పంటలను పరిశీలించి తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనాలు ఇవ్వాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు పంటల వద్దకు రాలేదని, దీంతో తీవ్ర నష్టాన్ని చవిచూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పంటలను సందర్శించి తగు జాగ్రత్తలు వివరించాలని కోరుతున్నారు.


ఝరాసంగం : తెగులు సోకడంతో టమాటా పంటను పొలంలో వదిలేసిన రైతులు

పొలంలోనే వదిలేశా..



విస్తారంగా వర్షాలు కురవడంతో టమాటా పంటలకు తెగుళ్ల రావడంతో కాయలు నల్లాబారుతున్నాయి. వాటిని మార్కెట్‌కు తరలిస్తే ధర పలకడం లేదు. కూలీల డబ్బులు కూడా రావడం లేదు. దీంతో పంటను పోలంలోనే వదిలేశా. అప్పుడు మార్కెట్‌లో ధర లేక, ఇప్పుడు వర్షాల వల్ల తీవ్రంగా నష్టం వాటిల్లింది.

-అశోక్ , రైతు

పెట్టుబడి వచ్చే పరిస్థితి లేదు..



మల్లన్నసాగర్‌లో తనకున్న భూమి ముంపునకు గురైతే గ్రామంలో ఒక ఎకరా పదిగుంటల భూమిని కౌలుకు తీసుకుని టమాట పంట సాగుచేశాను. రూ.80 వేల వరకు పెట్టుబడి పెట్టాను. పంట చేతి కందే దశలో వర్షానికి మొత్తం దెబ్బతిన్నది. కనీసం పెట్టుబడి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం తమకు న్యాయం చేసి నష్టపరిహారం అందజేయాలి.

- ఉప్పలయ, కౌలురైతు, తుక్కాపూర్

పంటలు నమోదు చేసుకుంటేనే పరిహారం

రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల వద్ద పంటల నమోదు చేసుకోవాలి. తొగుట మండలంలో 6.2 ఎకరాల్లో కూరగాయల పంటల సాగైనట్లు రికార్డుల్లో నమోదైంది. నష్టపరిహారం అందాలంటే పంటల వివరాలను నమోదు చేసుకుని ఉండాలి. క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- రమేశ్, దుబ్బాక డివిజన్ హార్టికల్చర్ అధికారి

దండం పెడతాం.. డంపు యార్డు వద్దు

- ఇప్పటికే రోగాల బారిన పడుతున్నాం..
- కంపెనీల కాలుష్యంతోనే ఊపిరాడడం లేదు
- కలెక్టర్ వల్లూరు క్రాంతితో గుండ్లమాచూనూర్‌వాసుల మొర

హత్నూర, సెప్టెంబరు 12: కంపెనీల కాలుష్యంతో ఊపిరాడటం లేదు. వయసుతో సంబంధం లేకుండా రోగాల బారిన పడుతున్నాం. ఇక డంపు యార్డు ఏర్పాటు చేస్తే ఇక్కడ బతకడం కష్టం అంటూ గుండ్లమాచునూర్ గ్రామస్థులు కలెక్టర్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గ్రామంలోని మోడల్ స్కూల్‌తోపాటు ఆ గ్రామ శివారులో డంపు యార్డు కోసం కేటాయించిన స్థలాన్ని కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న గుండ్లమాచునూర్‌వాసులు అక్కడకు చేరుకొని కాళ్ల మొక్కుతాం మేడం.. ఇక్కడ డంపుయార్డు వద్దంటూ అంటూ వేడుకున్నారు. ఇప్పటికే పరిశ్రమల కాలుష్యంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, 60 సంవత్సరాల పైబడి ఎవరు బతకడం లేదంటూ విన్నవించారు. ఈ స్థలంలో పరిసర గ్రామాల ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వ ఆసుపత్రి నిర్మించాలని కోరారు. దీనిపై విచారణ చేస్తామని కలెక్టర్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైనీ కలెక్టర్ మనోజ్, సంగారెడ్డి మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్ చౌహన్, తహసీల్దార్ ఫర్హీన్ షేక్, ఎంపీడీవో శంకర్, ఎంపీఈవో యూసుఫ్, ఆర్ఐ శ్రీనివాస్, సర్వేయర్ శ్రీనివాస్, పలు శాఖల అధికారులు ఉన్నారు. మోడల్ స్కూల్‌ను పరిశీలించిన సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధన చేసి ఉన్నత్తులుగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో కలెక్టర్ మొక్కలు నాటారు.


డంపుయార్డు స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ క్రాంతి

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి


వెంకటేష్(ఫైల్)

చిన్నశంకరంపేట, సెప్టెంబరు 12 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన చిన్నశంకరంపేట మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన రూపుల వెంకటేష్ (37) నాలుగు రోజుల క్రితం శాలిపేట గ్రామ నల్ల చెరువులో చేపలు పడుతుండగా కాళ్లకు వల చిక్కుకొని నీట మునిగి మృతి చెందాడు. రాత్రి అయినా వెంకటేష్ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. గురువారం ఉదయం చెరువు వద్దకు వెళ్లిన స్థానికులకు చెరువులో శవం తేలాడుతూ కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహన్ని వెలికి తీసి శవపంచనామా అనంతరం పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. రామాయంపేట మార్చురీకి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత మైనంపల్లి హనుమంతరావు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జిల్లా ఆసుపత్రి నుంచి బాలిక అదృశ్యం


ప్రణీత (ఫైల్)

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12 : బంధువులను చూడటానికి జిల్లా ఆసుపత్రికి వచ్చిన మతిస్థిమితం సరిగ్గా లేని ఓ బాలిక కనిపించకుండా పోయిన ఘటన సంగారెడ్డిలో చోటు చేసుకుంది. సంగారెడ్డి పట్టణ సీఐ ఎన్.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రపురం పట్టణంలోని రైల్వేకట్టకు చెందిన రాజు భార్య సుశీల కూతురు ప్రణీత (14) ఈ నెల 10న సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి బంధువును చూడటానికి వచ్చారు. అదేరోజు సాయంత్రం 5 గంటలకు అందరూ కలిసి భోజనం చేసిన తర్వాత ప్రణీత చేతులు కడుక్కోవడానికి బయటకెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ భాస్కర్ తెలిపారు.

శతాధిక వృద్ధురాలి మృతి


గంగాబాయి(ఫైల్)

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో సార గంగాబాయి జైస్వాల్(110) అనే శతాధిక వృద్ధురాలు గురువారం మృతి చెందింది. గంగాబాయికి మనవల్లు, మునిమనవల్లు ఉన్నట్లు స్థానికులు తెలిపారు.


యూత్ పార్లమెంట్ కాంపిటీషన్‌లో విద్యార్థులు

ఆకట్టుకున్న యూత్ పార్లమెంట్ కాంపిటీషన్

- ముఖ్యఅతిథిగా హాజరైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

వర్గల్, సెప్టెంబరు 12 : మండల కేంద్రంలోని జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం నిర్వహించిన 26వ రీజినల్ లేవల్ యూత్ పార్లమెంట్ కాంపిటీషన్ ఆకట్టుకున్నది. స్పీకర్, మంత్రుల పరిచయాలు తర్వాత ప్రభుత్వం, ప్రతి పక్షంలో ప్రదర్శించిన విద్యార్థులు సమస్యలు, వాటి పరిష్కరంపై నిజమైన లోక్ సభ ఎలా ఉంటుందో అలానే వాదనలు చేశారు. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ కాంపిటీషన్‌లో 55 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, విశిష్ట అతిథిగా నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ అసిస్టెంట్ కమిషనర్ ఉమాపతిరెడ్డి హాజరయ్యారు. ముందుగా నవోదయ విద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బుద్ధ విగ్రహాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్‌రావు మాట్లాడుతూ విద్యార్థుల ప్రదర్శనలు చూస్తుంటే నిజమైన పార్లమెంట్‌లో లోక్‌సభను చూసినట్లు ఉందన్నారు.

వైభవంగా మూలమహోత్సవం

వర్గల్, సెప్టెంబరు 12 : వర్గల్ శంభుగిరి కొండలపై వెలసిన విద్యాధరి క్షేత్రంలో మూలమహోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకుడు యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో విద్యా సరస్వతీ అమ్మవారికి విశేష పంచామృతాభిషేకాలు నిర్వహించారు. లక్ష పుష్పరచ, చండీ హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


లక్ష పుష్పార్చనలో పాల్గొన్న మహిళలు, విద్యార్థులు

సీజ్‌చేసిన వాహనాలు తీసుకెళ్లండి

- ఎస్పీ చెన్నూరి రమేష్

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 12: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో సీజ్‌చేసిన 269 ద్విచక్ర వాహనాలను సంబంధిత యజమానులు తగు ధ్రువపత్రాలు చూపించి తీసుకెళ్లాలని, లేకపోతే వాటిని వేలం వేస్తామని సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ తెలిపారు. వాహన యజమానులను గుర్తించేందుకు ప్రయత్నించగా సరైన చిరునామాలు లభించడం లేదన్నారు. వాహనాల వివరాలను సంగారెడ్డి జిల్లా పోలీసు వెబ్‌సైట్‌లో పొందుపరిచామని చెప్పారు. యజమానులు సంబంధిత పోలీస్‌స్టేషన్లకు వెళ్లి ఆరు నెలల్లో వాహనాలు తీసుకోవాలని, లేకుంటే వేలం వేస్తామని తెలిపారు.

దిగివచ్చిన ఎపిటోరియా యాజమాన్యం

- కార్మికులతో చర్చలు సఫలం.. ఆందోళన విరమణ


కార్మికులతో మాట్లాడుతున్న పరిశ్రమ ప్రతినిధులు

హత్నూర, సెప్టెంబరు 12: సమస్యల పరిష్కారం కోసం మూడు రోజులుగా హత్నూర మండలం బోర్పట్ల గ్రామ శివారులోని ఎపిటోరియా యూనిట్-1 పరిశ్రమ వద్ద కార్మికులు ఆందోళన చేస్తున్నారు. కాగా, గురువారం సాయంత్రం పరిశ్రమ ప్రతినిధులు చర్చలు జరిపి హామీల అమలుకు సానుకూలంగా స్పందించడంతో కార్మికులు ఆందోళనను విరమించారు. ఇచ్చిన మాట ప్రకారం తమ సమస్యలను పరిష్కరించాలని లేకుంటే తిరిగి ఆందోళన చేపడుతామని కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు.

నిమజ్జనం కారాదు విషాదం

వినాయకుడి శోభాయాత్రలో జాగ్రత్తలు తప్పనిసరి



మెదక్ కల్చరల్, సెప్టెంబరు 12: వినాయక చవితి వచ్చిందంటే చాలు యువత హడావిడి, హంగామా అంతాఇంతాకాదు. ఇక నిమజ్జన ఘట్టాన్ని అయితే అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఈ తరుణంలో ఏ మాత్రం ఆదమరిచినా ప్రాణాలమీదకు తెచ్చుకున్నట్లే. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల బారిన పడకుండా ఉండొచ్చు. వేడుకల కన్నా భద్రత ముఖ్యం అనే విషయాన్ని నిమజ్జనంలో పాల్గొనే ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

ఊరేగింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలివే..

ముఖ్యంగా వినాయకుడి నిమజ్జన ఊరేగింపులో తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ముందుకెళ్లాలి. ఊరేగింపు ఏమార్గంలో వెళ్లాలి అనే విషయాన్ని ముందుగానే ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ధారించుకోవాలి. ఆ దారిలో విద్యుత్ వైర్లు తగలకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలి. రంగులు చల్లుకుంటున్నప్పుడు కళ్లలో పడకుండా చూసుకోవాలి. లేదంటే అవి రసాయానిక రంగులు కావడంతో కంటి సమస్యలు వచ్చే ప్రమాదమున్నది. ఊరేగింపు మార్గదర్శక బాధ్యతలు కనీసం ఇద్దరు వ్యక్తులకు అప్పగించాలి. అందులో ఒకరు రహదారిపై ట్రాఫిక్‌ను నియంత్రణ చేస్తుంటే.. మరొకరు శోభాయాత్ర సరైన దారిలో జరుగుతుందా లేదా అనే విషయాన్ని పర్యవేక్షిస్తుండాలి. ఊరేగింపు జరిగేటప్పుడు రెండు వైపులా తాళ్లు పట్టుకొని కనీసం నాలుగు మంది వరుస క్రమంలో ఉండటం ఇంకా మంచిది. ఇలా చేయడం వలన వాహనాల రాకపోకలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా ఉంటుంది. ఊరేగింపులో పిల్లల చేయి వదలకుండా తల్లీదండ్రులు వెంటనే ఉంచుకోవాలి. అతిగా శబ్ద కాలుష్యం లేకుండా గణేషుడి శోభాయాత్ర నిర్వహించాలి.

బాణాసంచాలతో జాగ్రత్త...

ఊరేగింపులో చాల మంది ఉత్సాహంగా బాణాసంచాలు కాలుస్తుంటారు. ఉత్సాహంలో కనీస జాగ్రత్తలు తీసుకోకుండా ఎక్కడపడితే అక్కడ పటాకుల మోత మోగిస్తుంటారు. పటాకులు కాల్చేటప్పుడు దారిలో ఎవరైనా వస్తున్నారా.. లేదా అని చూసుకోవాలి. దూరంగా ఉండి వాటికి నిప్పు పెట్టాలి. నిమజ్జనం అంటేనే జనం రద్దీ ఎక్కువగా ఉంటుంది కాబట్టి వీలైనంత వరకు పటాకులు కాల్చకపోవడం మంచిదని నిర్వాహకులు గుర్తించాలి.

ఇవి అందుబాటులో ఉంచుకోవాలి...

నిమజ్జనంలో అత్యవసర వస్తువులు తప్పనిసరిగా అందుబాటులో ఉంచుకోవాలి. నీరసం కోల్పోకుండా తరుచూ తీసుకునేందకు నీరు, ఆహారం ఉండేలా చూసుకోవాలి. చిన్న చిన్న గాయాలు అయ్యినప్పుడు వెంటనే చికిత్స తీసుకునేందుకు ప్రథమ చికిత్స కిట్‌ను వెంట ఉంచుకోవాలి. అవసరమైతే ఈ బాధ్యతను ఒకరికి అప్పగించి ఊరేగింపు ముగించేవరకు తోడుండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారులు సైతం వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచాలి. అత్యవసరమైతే ఆసుపత్రులకు పంపించేందుకు వీలుగా అంబులెన్సుల సౌకర్యాన్ని కల్పించాలి. అధిక రక్త పోటు, గుండె సంబంధిత వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు వహించాలి. శబ్దం ఎక్కువగా ఉంటే రక్తపోటు పెరిగే అవకాశం ఉన్నందునా అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి.

చెరువులు, ప్రాజెక్టుల వద్ద జర జాగ్రత్త..

నిమజ్జనం సమయంలో చెరువు వద్ద ఏ మాత్రం ఆద మరిచినా ప్రాణపాయం తప్పదు. ఈతరాని వారు నీటికి దూరంగా ఉండాలి. నీటిలోకి దూకడం లాంటివి అస్సలు చేయకూడదు. ముఖ్యంగా చెరువు లోతు అంచనా వేస్తూ ముందుకెళ్లాలి. చెరువుల వద్దకు చిన్నారులకు తీసుకోకపోవడం ఉత్తమం. విగ్రహాలు పెద్దవి అయితే దానికోసం క్రేన్‌లు, పడవలు వాడటం మంచిది. నిమజ్జన జరిగే స్థలంలో గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలి.

రెయిలింగ్‌ను ఢీకొట్టిన ప్రైవేటుబస్సు

- తృటిలో తప్పిన ప్రమాదం

జహీరాబాద్,సెప్టెంబరు 12: ఓ ప్రైవేటు బస్సు రెయిలింగ్‌ను ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్లితే పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన డ్రైవర్ రాజు ప్రైవేటు బస్సును నడుపుతున్నాడు. రోజు మాదిరాగానే దిగ్వాల్ గ్రామంలోని ఫిరమాల్ కర్మాగారంలో కార్మికులను తీసుకెళ్లడానికి గురువారం మధ్యాహ్నం తాండూర్‌కు వెళ్లే రోడ్డుగుండా రాంనగర్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్నాడు. బ్రిడ్జిపైకి బస్సుతో కొద్దిదూరం రాగానే ఓ వ్యక్తి బైకుపై ఫోన్ మాట్లాడుతూ బస్సుకు ఎదురుగా వచ్చాడు. అతడిని తప్పించబోయే క్రమంలో బస్సుతో బ్రిడ్జి రెయిలింగ్‌ను ఢీకొట్టి ఆగిపోయింది. దీంతో డ్రైవర్ రాజుకు తృటిలో ప్రమాదం తప్పింది



విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నాగల్‌గిద్ద, సెప్టెంబరు 12: విద్యార్థులు చదువుతోపాటు క్రీడాల్లోనూ రాణించాలని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడలు ముగియడంతో.. అందులో గెలుపొందిన విద్యార్థులకు గురువారం నాగల్‌గిద్దలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శంకర్, హీరామన్, రవీందర్‌రావు, మోర్గి మోడల్ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదే: ఎమ్మెల్యే

పటాన్‌చెరు, సెప్టెంబరు 12: సమాజంలో ఉత్తమ పౌరులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గురుపూజోత్సవం సందర్భంగా పటాన్‌చెరు జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నియోజకవర్గస్థాయి ప్రభుత్వ పాఠశాలల ఉత్తమ ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. గత 25 ఏళ్లుగా ఉత్తమ ఉపాధ్యాయులను ఏటా గురుపూజోత్సవం సందర్భంగా సన్మానిస్తూ వస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఐదు మండలాలకు చెందిన 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు రాథోడ్, జెమినికుమారి, కాంగ్రెస్ నాయకులు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

తడి, పొడి చెత్త నిర్వహణ సక్రమంగా ఉండాలి: డీపీవో

కంది, సెప్టెంబరు 12: గ్రామాల్లో తడి, పొడి చెత్త నిర్వహణ సక్రమంగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) సాయిబాబ అన్నారు. మండల కేంద్రమైన కందిలోని డంపింగ్‌యార్డును గురువారం పరిశీలించారు. డంపింగ్‌యార్డులో తడి చెత్తతో ఎరువులు తయారు చేయాలని కార్యదర్శి, పంచాయతీ సిబ్బందికి సూచించారు. కందిలోని ఇళ్లు, హోటళ్లు, దాబాలలోని చెత్తను సేకరించేటప్పుడు తడి, పొడి చెత్తలను వేరు చేయించి ఇచ్చేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్‌రెడ్డి, కార్యదర్శి విద్యాధర్ ఉన్నారు.

●**హత్నూర:** గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సంగారెడ్డి డీఎల్‌పీవో అనిత అన్నారు. గురువారం హత్నూర మండలం కొన్యాల గ్రామాన్ని సందర్శించిన అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు.

●**మునిపల్లి:** పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు సూచించారు. గురువారం మండల పరిధిలోని బుసారెడ్డిపల్లి, మల్లారెడ్డిపేట గ్రామాలను సందర్శించి పంచాయతీ కార్యాలయాన్ని, అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ప్రతీరోజు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు.

●**నారాయణఖేడ్:** కలెక్టర్ క్రాంతి ఆదేశాల మేరకు ఖేడ్ మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డు మన్సూర్‌పూర్‌లో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

●**కంగ్టి:** మండల పరిధిలోని తుర్కవడగాంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో సత్తయ్య గురువారం పరిశీలించారు. మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని కార్మికులతో తొలగింపజేశారు.

బస్టాండ్‌లో పరిశుభ్రత చర్యలు చేపట్టాలి

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: నారాయణఖేడ్ ఆర్టీసీ బస్టాండ్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని టీపీసీసీ సభ్యుడు శంకరయ్యస్వామి కోరారు. బస్టాండ్ ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు దట్టంగా పెరిగాయని, దీంతో పందులు, కుక్కలు సంచరిస్తున్నాయన్నారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పరిశుభ్రత చర్యలు చేపట్టాలన్నారు.


కందిలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబ

పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్

కౌడిపల్లి, సెప్టెంబరు 12: వారంరోజులుగా కురిసిన భారీ వర్షాలకు పంటలకు చీడపీడలు ఎక్కువ స్థాయిలో ఆశించే అవకాశం ఉన్నందున రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్ సూచించారు. గురువారం కౌడిపల్లి మండలం తునికిలోని కేవీకే కృషి విజ్ఞాన కేంద్రంలో వరి, పత్తి పంటలను అక్కడి శాస్త్రవేత్తలతో కలిసి పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శిక్షణ అధికారి సుమతి, పాల్గొన్నారు.

●**మునిపల్లి:** ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో దెబ్బతిన్న పత్తి పంటను గురువారం సంగారెడ్డి జిల్లా వ్యవసాయశాఖ అధికారి శివప్రసాద్ పరిశీలించారు. ఆయన వెంట ఏడీఏ సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, ఏఈవోలు రహమాన్, లావణ్య, స్నేహ, అంజన్న ఉన్నారు.

●**చేగుంట:** నార్సింగి మండల పరిధిలోని వరి పంట పొలాలను వ్యవసాయ విస్తీర్ణ అధికారి విజృంభణ సందర్శించి పరిశీలించారు.

●**నర్సాపూర్:** నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి, ఆద్మాపూర్ పరిధిలోని వరి, కంది పంటలను గురువారం వ్యవసాయ శాఖ ఏడీఏ సంధ్యారాణి, వ్యవసాయ శాస్త్రవేత్త శోభతో పాటు ఇతర అధికారులు సందర్శించి పరిశీలించారు. వీరివెంట మండల వ్యవసాయ అధికారి దీపిక, నాయకులు ఉన్నారు.


కౌడిపల్లి: కేవీకేలో వరి పంటను పరిశీలిస్తున్న మెదక్ జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి

శివ్వంపేట, సెప్టెంబరు 12: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తి మృతిచెందాడు. మండల పరిధిలోని సికింద్లాపూర్ పిట్టలవాడకు చెందిన అజయ్(30) పశువుల కాపరిగా ఉంటూ దినసరి కూలి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. బుధవారం రాత్రి బంధువుల బైక్ తీసుకుని పిట్టలవాడ నుంచి బిజిలిపూర్ మీదుగా నర్సాపూర్ వెళ్తున్నాడు. పెద్దగొట్టిముక్ల శివారులో బైకు చెట్టుకు ఢీకొని పంట పొలంలోకి దూసుకెళ్లడంతో మృతిచెందాడు. మృతుడికి భార్య శ్యామల, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.


మృతిచెందిన అజయ్

ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ఒకరికి గాయాలు

పెద్దశంకరంపేట సెప్టెంబరు 12: ఆర్టీసీ బస్సు, కారు ఢీకొని ఒకరికి గాయాలైన సంఘటన పెద్దశంకరంపేటలోని 161వ జాతీయ ప్రధాన రహదారి దర్గా వద్ద గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి పిట్లం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును పెద్దశంకరంపేట నుంచి కట్టెల వెంకటాపూర్ దర్గా వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడిపిన డాక్టర్ అజ్మీర్‌కు గాయాలయ్యాయి. అతడిని పేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బస్ కండక్టర్‌కు స్వల్పగాయాలయ్యాయి. ఏఎస్‌ఐ సునీత సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు.

మహిళ అదృశ్యం

నర్సాపూర్, సెప్టెంబరు 12: నర్సాపూర్‌లో కూరగాయలు విక్రయించడానికి వచ్చిన గిరిజన మహిళ అదృశ్యమైంది. ఎస్‌ఐ లింగం వివరాల ప్రకారం.. నర్సాపూర్ మండలం ఎల్లారెడ్డిగూడెం తండాకు చెందిన అంగోత్ శాంతి బుధవారం నర్సాపూర్‌లో కూరగాయలు అమ్మడానికి వచ్చింది. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఫోన్ చేయగా.. స్విచ్ఛాఫ్ వచ్చింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం మహిళ భర్త అమ్ము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లింగం తెలిపారు.


శాంతి(ఫైల్)

6.80 కోట్ల అభివృద్ధి పనులకు పాలకవర్గ ఆమోదం

● మున్సిపల్ చైర్‌పర్సన్ రోజారాణి

జిన్నారం, సెప్టెంబరు 12: బొల్లారం మున్సిపల్ పాలకవర్గ సమావేశంలో 6 కోట్ల 80 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. గురువారం మున్సిపల్ భవనంలో చైర్‌పర్సన్ రోజారాణి అధ్యక్షతన పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలోని 22 వార్డుల్లో వార్డుకు రూ.30 లక్షల చొప్పున రూ.6.80 కోట్లతో సీసీ రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనుల నిర్వహణ, మూడోవార్డులో రూ.50 లక్షలతో వైకుంఠధామం ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రోజారాణి, వైస్ చైర్మన్ అనిల్‌కుమార్‌రెడ్డిలు మాట్లాడుతూ పట్టణంలో చేపట్టిన మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తి చేసి నీటి సరఫరా చేయాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా పారిశ్రామిక ప్రాంతంలో రహదారులు, పలు కాలనీల్లో నీటి సమస్య నెలకొన్నట్లు కౌన్సిలర్లు సమావేశంలో ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చంద్రారెడ్డి, వేణుపాల్‌రెడ్డి, సుజాత, హన్మంతరెడ్డి, చంద్రయ్య, నర్సింహరాజు, బీరప్ప, సంధ్య, రాధ, మున్సిపల్ మేనేజర్ నిర్మలారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెదక్ జిల్లాలో లక్ష సభ్యత్వమే లక్ష్యం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్

నర్సాపూర్, సెప్టెంబరు 12: మెదక్ జిల్లాలో రెండు నియోజకవర్గాల పరిధిలో లక్షకు తగ్గకుండా బీజేపీ సభ్యత్వ నమోదు చేయడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గడ్డంశ్రీనివాస్, జిల్లా ఇన్‌చార్జి మురళీధర్‌గౌడ్‌లు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాన్ని స్థానిక నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళీధర్‌యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రమణ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్‌తో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాల పరిధిలో మొత్తం లక్షకు తగ్గకుండా ప్రతి బూత్‌కు 200లకు మించి సభ్యత్వ నమోదు చేయాలని లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్, కౌన్సిలర్లు సురేష్, బుచ్చేష్ యాదవ్, యాదగిరి, రమేష్‌యాదవ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

'వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలు పరిష్కరిస్తాం'

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12: వసతి గృహ సంక్షేమాధికారుల సమస్యలు పరిష్కరిస్తామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ తెలిపారు. ఇటీవల తెలంగాణ వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం నూతన జిల్లా ఫోరమ్ ఎన్నికైన సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్‌హుస్సేని, జిల్లా అధ్యక్షుడు జావేద్‌అలీ, కార్యదర్శి వి.రవి, వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌస్ మొయినొద్దీన్, జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

కోనాయపల్లి పీటీలో ఎంపీడీవో సందర్శన

మనోహరాబాద్, సెప్టెంబరు 12: వారంరోజుల క్రితం కురిసిన వర్షాల దృష్ట్యా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. గురువారం మనోహరాబాద్ మండల కేంద్రంలోని కోనాయపల్లి పీటీ గ్రామంలోని పరిశుభ్రతను ఎంపీడీవో వెంకటేశ్వర్లు, అలాగే వెంకటాపూర్‌లో ఎంపీవో లక్ష్మీనర్సింహులుతో కలిసి ఇంటింటికి తిరిగి ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించారు. అలాగే గ్రామంలోని అంగన్‌వాడీ పాఠశాలను సందర్శించి గర్భిణులకు అందిస్తున్న పోషకాహారం గురించి తెలుసుకున్నారు.

'కాంగ్రెస్ నాయకులను గూండాలని వర్ణించడం సబబు కాదు'

గుమ్మడిదల, సెప్టెంబరు 12: ఖమ్మం జిల్లాలో వరద బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీమంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ నాయకులను గూండాలుగా చిత్రీకరించి దాడిచేసి గాయపరిచారని చేసిన వ్యాఖ్యలు సబబు కాదని కాంగ్రెస్ గుమ్మడిదల మండల నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. గురువారం కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేవలం రాజకీయ లబ్ధిపొందాలనే నెపంతోనే హరీశ్‌రావు పటాన్‌చెరు నియోజకవర్గానికి వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులపై అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పుట్ట నర్సింగరావు పాల్గొన్నారు.

'కస్తూర్బా'లో ఆర్డీవో ఆకస్మిక తనిఖీ

చేగుంట, సెప్టెంబరు 12: చేగుంట మండలం రెడిపల్లిలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను, వంటశాలలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి ఆర్డీవో భోజనం చేశారు. తదనంతరం చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని పరిశ్రమల యాజమాన్యంతో సమావేశం నిర్వహించారు. చేగుంట మండలం వడియారంలోని ఎస్సీ హాస్టల్‌లో సరిపడా గదులు లేక పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, హాస్టల్ ఆవరణలో రేకులషెడ్డు నిర్మాణానికి పరిశ్రమల వారు కొంత ఆర్థిక సహాయం అందించాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన మహిళా శిశుసంక్షేమ శాఖ ఆర్‌జేడీ

పటాన్‌చెరు, సెప్టెంబర్ 12: అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్న పిల్లల ప్రీ స్కూల్ బోధనా విధానాలను, బాలింతలు, పిల్లలకు సంతులిత పౌష్టికాహార వితరణను మహిళా శిశు సంక్షేమ శాఖ రీజినల్ డైరెక్టర్ మోతీ, రీజినల్ డైరెక్టరేట్ సూరింటెండెంట్ స్వరూపరాణి గురువారం పరిశీలించారు. గురువారం పటాన్‌చెరు ఆల్విన్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి పటాన్‌చెరు ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టరేట్ సూపర్‌వైజర్ వాసవి, పటాన్‌చెరు సీడీపీవో జయరాంనాయక్, సూపర్‌వైజర్లు విశ్వనీత, సల్మా సుల్తానియా తదితరులు పాల్గొన్నారు.


ఆల్విన్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్‌జేడీ మోతీ

త్రిబుల్‌ఆర్ సమస్య పరిష్కరిస్తాం: ఆర్డీవో

శివ్వంపేట, సెప్టెంబరు 12: త్రిబుల్‌ఆర్‌కు సేకరించిన పోతులబొగుడ భూ సమస్య పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఆర్డీవో జగదీష్‌రెడ్డి అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో మండల పరిధిలోని పోతులబొగుడ గ్రామానికి చెందిన రైతులతో సమావేశం నిర్వహించారు. సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పోతులబొగుడలో ఆర్‌ఆర్‌ఆర్ కేటాయించిన సుమారు 40 ఎకరాల భూమిలో పొజిషన్ సర్వేనెంబర్ సమస్యతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అధికారుల ఆదేశాలతో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

'సకాలంలో వైద్యసేవలందించాలి'

కోహీర్, సెప్టెంబరు 12: వైద్యులు సకాలంలో స్పందించి నాణ్యమైన వైద్యమందించాలని వైద్య విధాన పరిషత్ ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ సంగారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రమైన కోహీర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. వైద్యులు విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించకుండా అందుబాటులో ఉండాలన్నారు.

మరో జాతీయ అవార్డుకు కృషి చేయాలి: డీపీవో

తూప్రాన్, సెప్టెంబరు 12: మల్కాపూర్ గ్రామానికి మరో జాతీయ అవార్డు సాధించేందుకు కృషి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామాన్ని ఆయన సందర్శించారు. జాతీయ అవార్డు సాధించేందుకు గ్రామస్థులందరు ఐకమత్యంగా ముందుకుసాగాలని కితాబు ఇచ్చారు.

మెదక్ జిల్లా ట్రాన్స్‌కో ఎస్‌ఈగా శంకర్

మెదక్, సెప్టెంబరు 12: మెదక్ జిల్లా విద్యుత్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్‌ఈ)గా శంకర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మెదక్ ఎస్ఈగా పనిచేసిన జానకీరాములు ఉద్యోగ విరమణ చేయగా.. ఆయన స్థానంలో శంకర్‌ను ఎస్‌ఈగా నియమించారు. ఈ సందర్భంగా రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం యూనియన్ నాయకులు ఓరం సత్యనారాయణ, నర్సింగ్, అశోక్, రమేష్, రాజేశ్వర్, నాగరాజు, శేఖర్, శ్రీకాంత్, చంద్రమౌళి, కనకయ్య, రత్నం, రాములు, బాలకృష్ణ పూలమాలతో సన్మానించారు.

మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా పాటిల్ శోభారాణి

జహీరాబాద్,సెప్టెంబరు 12: జహీరాబాద్ నియోజకవర్గం మహిళా మోర్చా అసెంబ్లీ కన్వీనర్‌గా జహీరాబాద్ పట్టణానికి చెందిన శోభారాణిని నియమిస్తూ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మాధురీఆనంద్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా బీజేపీని బలోపేతం చేస్తూ, మహిళలను జాగృతం చేయాలన్నారు.

సాముహిక కుంకుమార్చన

చేగుంట, సెప్టెంబరు 12: చేగుంట మండల కేంద్రంలోని శ్రీకన్యకా పరమేశ్వరీ ఆలయంలో వైశ్య సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపం వద్ద గురువారం వాసవీ మహిళా శక్తి మహిళల సామూహిక కుంకుమార్చనలు, పారాయణం నిర్వహించారు.

సీతారాం ఏచూరికి సీఐటీయూ నాయకుల నివాళి

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి కమ్యూనిష్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ నాయకులు తెలిపారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నాయకులు గురువారం సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బజరంగ్ దళ్ జిల్లా అధ్యక్షుడిగా ప్రభుకుమార్‌గౌడ్

పుల్‌కల్, సెప్టెంబరు 12: బజరంగ్ దళ్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రం చౌటకూర్‌కు చెందిన పల్లె ప్రభుకుమార్‌గౌడ్‌ను నియమించారు. మెదక్ జిల్లా రామాయంపేటలో గురువారం మెదక్ విభాగ్ విశ్వహిందూ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ధర్మ ప్రసార్ కో కన్వీనర్ సుభాష్‌చందర్, మెదక్ విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశంలు హాజరయ్యారు. సమావేశం అనంతరం సంగారెడ్డి జిల్లా బజరంగ్ దళ్ నూతన అధ్యక్షుడుగా ప్రభుకుమార్‌గౌడ్, సహ సంయోజక్‌గా సురేష్‌ను నియమించారు.

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుంది: ఎమ్మెల్యే

శివ్వంపేట, సెప్టెంబరు 12: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని గోమారం ఉన్నంత పాఠశాలలో జిల్లా విద్యాధికారి రాధాకిషన్ ఆదేశాల మేరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-14,17 బాలబాలికలకు సంబంధించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బుచ్చానాయక్, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మెదక్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగాల రమేష్, విద్యార్థులు, మాజీ ఎంపీపీ హరికృష్ణ పాల్గొన్నారు.


గోమారం పాఠశాలలో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

ఉపాధ్యాయుడికి ఎంత సేవచేసినా తక్కువే

మనోహరాబాద్, సెప్టెంబరు 12: ఉపాధ్యాయుడికి ఎంత సేవచేసినా తక్కువేనని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మనోహరాబాద్ మండలం గౌతోజిగూడ గ్రామానికి చెందిన 42 మంది పూర్వ విద్యార్థులు పూర్వ ఉపాధ్యాయులకు గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచుల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు రేణుకుమార్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర: బీజేపీ

మెదక్ అర్బన్/సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 12: రిజర్వేషన్లను రద్దు చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ విదేశీ పర్యటనలో చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ.. గురువారం బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. దేశ ప్రజలను కించపరిచే విధంగా మాట్లాడిన రాహుల్‌గాంధీ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని కొత్త బస్టాండ్ వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పోచారం రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదిర్శ అనంతరావు, ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఇష్వా ఫౌండేషన్ సేవలు విస్తరించాలి: డీఈవో రాధాకిషన్

తూప్రాన్, సెప్టెంబరు 12: ఇష్వా ఫౌండేషన్ సంస్థ సేవలు మరిన్ని పాఠశాలలకు విస్తరించి విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా విద్యాధికారి రాధాకిషన్ పేర్కొన్నారు. గురువారం తూప్రాన్ పట్టణంలో తూప్రాన్ బాలుర, బాలికల, బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో 10వ తరగతిలో 9జీపీఏ సాధించిన 28 మంది విద్యార్థులకు ఇష్వా ఫౌండేషన్ రూ.15వేల వంతున స్కాలర్‌షిప్ అందజేసింది. ఈ కార్యక్రమానికి డీఈవో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఇష్వా ప్రోత్సాహం గొప్పదని అన్నారు. తూప్రాన్ బాలికల పాఠశాలకు చెందిన పూజ, అక్షయలకు కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదివేందుకు ఒక్కొక్కరికి రూ.లక్ష వంతున ఫీజు చెల్లింపులు చేశారు. తూప్రాన్ పాఠశాలకు రూ.40వేల విలువైన కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. ఇష్వా ఫౌండర్ శిల్ప, కార్యదర్శి హైమంతి, ఎంఎన్‌వో సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయులు ఫ్లోరెన్స్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

దళితులను బహిష్కరించిన వారిపై కేసు నమోదు చేయాలి

● డీబీఎఫ్, ఏఎస్ఏ, మానవ హక్కుల వేదిక సంఘాల డిమాండ్

మనోహరాబాద్, సెప్టెంబరు 12: మనోహరాబాద్ మండలం గౌతోజీగూడ గ్రామానికి చెందిన దళిత కుటుంబాన్ని సాంఘిక బహిష్కరణ చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకుడు రోహిత్, అంబేడ్కర్ విద్యార్థి సంఘం నాయకులు దివాకర్ డిమాండ్ చేశారు. గురువారం వారు బాధిత కుటుంబాన్ని పరామర్శించి మాట్లాడారు. ఆత్మగౌరవంతో జీవిస్తున్న కుటుంబాన్ని కుల బహిష్కణ చేయడంపై వారు మండిపడ్డారు. అనంతరం బహిష్కరణ చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో చంద్రం, అర్జున్, డీబీఎఫ్ నేతలు పులి కల్పన, దాసరి ఎగోండ, స్వామి, దుభాషి సంజీవ్, నర్సింహ పాల్గొన్నారు.

రైతుల ఫోన్‌కు స్పందించిన ఎమ్మెల్యే

● కాముని చెరువు కట్టపై ముళ్ల పొదల తొలగింపు


ముళ్ల పొదలు తొలిగించిన అనంతరం కామునిచెరువు కట్ట పరిస్థితి

కల్హేర్, సెప్టెంబరు 12: ఉమ్మడి మెదక్ జిల్లాలోనే 375 ఎకరాల ఆయకట్టు కలిగి చారిత్రాత్మక చెరువుగా వెలుగొందుతున్న కల్హేర్‌లోని కాముని చెరువు కట్టపై ఏపుగా పెరిగిన ముళ్ల పొదలను ఎమ్మెల్యే పి.సంజీవరెడ్డి ఆదేశాలతో నీటి పారుదల శాఖ సిబ్బంది బుధ, గురువారాల్లో తొలగించారు. కట్టపై నుంచి కుడి, ఎడమ కాలువకు వెళ్లడానికి వీలు లేకుండాపోవడంతో రైతులు, కాంగ్రెస్ నాయకులు మంగళవారం చూసి ఎమ్మెల్యేకు ఫోన్‌లో సమాచారమందించారు. స్పందించిన ఆయన నీటిపారుదల శాఖ డిప్యూటీ ఇంజనీర్ పవన్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి మరుసటిరోజే కట్టపై ముళ్లపొదల తొలగింపు పూర్తిచేశారు. ఎన్నోఏళ్లుగా అధికారులు చేయలేని పనులను ఒక్క ఫోన్ కాల్‌తో ఎమ్మెల్యే చేయించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ


కొండాపూర్, సెప్టెంబరు 12: సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి మండలంలోని పలు కార్యాలయాల్లో గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ రికార్డులు పరిశీలించి, ధరణి రిజిస్ట్రేషనలపై ఆరాతీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, వసతులపై విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం గిర్మాపూర్ గురుకుల పాఠశాలను సందర్శించారు. ఆమెవెంట తహసీల్దార్ అనిత ఉన్నారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీఎస్పీ

తూప్రాన్/నారాయణఖేడ్, సెప్టెంబరు 12: తూప్రాన్ పెద్దచెరువు కట్టపై వినాయక నిమజ్జన ఏర్పాట్లను తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పరిశీలించారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు మామిండ్ల కృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మోయిజుద్దీన్, తహసీల్దార్ విజయలక్ష్మితో చెరువు కట్టను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌కు సూచించారు. అలాగే నారాయణఖేడ్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ముందు గజానన యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడిని డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డిలు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

లక్ష్యాన్ని మధ్యలో వదిలేస్తే విజయాన్ని అందుకోలేరు: మైనంపల్లి హన్మంతరావు

పాపన్నపేట, సెప్టెంబరు 12: లక్ష్యాన్ని మధ్యలో వదిలేస్తే విజయాన్ని అందుకోలేరని మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు విద్యార్థులకు హితబోధ చేశారు. పాపన్నపేటలో గురువారం జరిగిన మండల స్థాయి ఎస్జీఎఫ్ క్రీడల ముగింపులో పాల్గొని బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. అంతకుముందు అర్కెలలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో పూజలు చేసి, అన్నదాన వితరణలో, అలాగే కాంగ్రెస్ మాజీ నాయకులు డాక్యతండా రాజు, ఆరేపల్లి రాజశేఖర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మైనంపల్లి హనుమంతరావు

బాధిత కుటుంబానికి 'మైనంపల్లి' భరోసా

రామాయంపేట, సెప్టెంబరు 12: చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లిన ఓ వ్యక్తి మృత్యువాత పడగా..ఆ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు భరోసా కల్పించారు. చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్ చెందిన వెంకటి గురువారం చనిపోగా విషయం తెలుసుకున్న మైనంపల్లి రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని బాధితులను ఓదార్చారు. అంతేకాక ఆ కుటుంబానికి తన సొంత ఖర్చులతో ఇల్లు కట్టిస్తానని మాటిచ్చారు. అంతకుముందు వైశ్యభవన్, పూసల సంఘం ఏర్పాటు చేసిన గణేష్‌ల వద్ద నిర్వహించిన అన్నదానంలో పాల్గొన్నారు.

'పాడి పరిశ్రమాభివృద్ధికి సాంకేతికతను వాడాలి'

జహీరాబాద్,సెప్టెంబరు 12: పాడి పరిశ్రమ రంగంలో రైతులు సాంకేతికతను వినియోగించుకుంటే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కేవీకే హెడ్, డా.వరప్రసాద్ పేర్కొన్నారు. గురువారం అల్గోల్-డిడిగి గ్రామాల శివారులో గల కృషివిజ్ఞాన(కేవీకేలో) కేంద్రంలో రైతులకు పాడి పరిశ్రమ రంగం అభివృద్ధిపై శిక్షణ నిర్వహించారు. పాడి పరిశ్రమ రంగంలో సాంకేతికను ఉపయోగించుకుంటే తక్కువ ఖర్చు వస్తుందన్నారు. ఇదిలా ఉండగా ఈనెల 18, 19న కేవీకేలో సేంద్రియ ఎరువుల తయారీ, నారుమడుల పెంపకం, పండ్ల తోటలకు అంట్లు కట్టడం, పూలమొక్కల బడ్డింగ్ విధానం, ఔషధ మొక్కల కటింగ్స్, తదితరాలపై రైతులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తిగల రైతులు కేవీకేలో 8179088347 నెంబరుకు సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంజేపీ విద్యార్థులు

కౌడిపల్లి, సెప్టెంబరు 12: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు మండలంలోని మహాత్మా జ్యోతిపూలే(ఎంజేపీ) గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతికి చెందిన ప్రశాంత్, శశికుమార్, రాకేష్, ఏడో తరగతికి చెందిన నవదీప్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో గెలుపొంది పాఠశాలకు మంచిపేరుకు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.


కౌడిపల్లి: ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సౌత్‌జోన్ సైక్లింగ్ పోటీలకు ఈ తక్షిల విద్యార్థినులు

ఎన్‌కేడీ ఫోటో8:ఖేడ్‌లో ఈ తక్షిల పాఠశాల కరస్పాండెంట్‌తో పోటీలకు ఎంపికైన విద్యార్థినులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 12: ఈనెల 14, 15 తేదీల్లో నిజామాబాద్‌లో జరగనున్న ఖేల్ ఇండియా ఉమెన్స్ సౌత్‌జోన్ పోటీలకు ఖేడ్ పట్టణంలోని ఈ తక్షిల పాఠశాల విద్యార్థినులు అర్చన, గ్రేసి, శ్వేత ఎంపికైనట్లు సైక్లింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.మల్లారెడ్డి, ఇతర బాధ్యులు విజయకాంతారావు, రమేష్ గురువారం తెలిపారు. విద్యార్థినులను కరస్పాండెంట్ శరత్‌కుమార్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఉత్సాహంగా ఎస్జీఎఫ్ క్రీడలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 12: స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో మండల స్థాయి కబడ్డీ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు 22 పాఠశాలల నుంచి క్రీడాకారులు పాల్గొనగా.. ఎంఈవో నీలకంఠం ప్రారంభించారు. అండర్ 14, 17 బాలబాలకలకు హోరాహోరీగా జరిగిన కబడ్డీ పోటీల్లో 40 మంది క్రీడాకారులు జిల్లాకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు, పీడీలు మాధవరెడ్డి, శ్యామయ్య, దేవేందర్‌రెడ్డి, రవి, పీఈటీలు కుమార్, పోచయ్య, రవి, లాజర్, శిల్ప, ప్రీతి, శ్వేత పాల్గొన్నారు.

●**అందోల్:** జోగిపేటలోని ఎన్టీఆర్ స్టేడియం గ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన క్రీడా పోటీల్లో అందోల్ మండలం నేరేడుగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాహుల్, శ్రీను, నాగేష్, మనోహర్, మహేష్, చరణ్ ఉత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ఫిజికల్ డైరెక్టర్ సుభాష్ గౌడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

●**కంది:** వారంరోజులుగా మండలస్థాయిలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో కందిలోని మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అండర్-14 విభాగంలో ఖోఖోతో కలిపి మొత్తం మూడు విభాగాల్లో నాలుగు ప్రథమ బహుమతులు గెలుచుకున్నారు.

●**మునిపల్లి:** మండలస్థాయిలో జరిగిన క్రీడల్లో మునిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బాలికల అండర్-14, 17 వాలీబాల్‌లో విజేతలుగా నిలిచారు. పీడీ మన్సూర్‌లను ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి అభినందించారు.